# సత్యవాక్కు

## క్రైస్తవ మాస పత్రిక

# THE WORD OF TRUTH

# మీకొక సదవకాశము!

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న "సత్యవాణి" యను రేడియో కార్యక్రమముద్వారా లక్షలాది ప్రజలు గొప్ప ఆత్మీయ మేలులను పొంది యున్నారు. మరికొందరు మేము ప్రచురించిన తెలుగు పుస్తకములద్వారా మేలు పొంది యున్నారు.

మీరు బైబిలు సత్యములను సులువుగా గ్రహించు నిమిత్తము మేము ముద్రించిన సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు 25 రకములు మావద్ద ఉన్నవి. అవియేగాక రాబోవు రెండు సంవత్సరములలోను సత్యవాక్య మాసపత్రికను మీరు క్రమముగా పొందవలెనంటే ఈ దిగువ చిరునామాకు రూ. 15/- లు మాత్రము పోస్టేజీ ఖర్చులకు పంపించి మీ పేరు నమోదు చేయించుకొనండి! మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంథాలయాన్ని తెరవండి!!

**SATYA VANI**
(P.O. Box 80) Seshagiri Rao St.
KAKINADA-533 004

గమనిక :- మీరు M.O. పంపునప్పుడు, మాకు ఉత్తరములు వ్రాయునప్పుడు, మీ అడ్రసులో మార్పు కలిగినప్పుడు మీ సత్యవాక్య నంబరును మాకు తెలియజేయండి. ఇది అత్యవసరం!!

రాజన్ ప్రెస్, కాకినాడ.

# సత్యవాక్యం

**THE WORD OF TRUTH**

**P.O. Box 80, KAKINADA, A.P. 533 001**

Editor : J. C. CHOATE

Managing Editor : JOSHUA GOOTAM

**Pleading for Restoration of First Century Christianity**

సంచిక **5** డిసెంబరు **1987** సంపుటి **8**


## సంపాదకీయము

### మనవలె క్రీస్తు అన్ని విషయములలోను శోధింపబడెను

***(Christ was tempted in all points as we are)***

"ఆకాశ మండలముగుండ వెళ్ళిన దేవుని కుమారుడైన యేసు అను గొప్ప ప్రధాన యాజకుడు మనకున్నాడు గనుక మనము ఒప్పుకొనిన దానిని గట్టిగా చేపట్టుదము. మన ప్రధాన యాజకుడు మన బలహీనతలయందు మనతో సహానుభవము లేనివాడు కాడు గాని, సమస్త విషయములలోను మనవలె శోధింపబడినను, ఆయన పాపము లేనివాడుగా ఉండెను. గనుక మనము కనికరింపబడి సమయోచితమైన సహాయము కొరకు కృప పొందునట్లు ధైర్యముతో కృపాసనము నొద్దకు చేరుదము," అని హెబ్రీ గ్రంథకర్త వ్రాయుచున్నాడు (హెబ్రీ 4:14-16).

ఈ వచనములందు అనేక గొప్ప సత్యములు యిమిడి యున్నవి. మనవలె క్రీస్తు అన్ని విషయములలోను శోధింపబడెనను సత్యమును పై వాక్యములందు గమనించుము. అయినప్పటికి క్రీస్తు పాపము చేయ

లేదు. ఇది గ్రహించుట కష్టమని కొందరి అభిప్రాయము. ఏల యనగా వారు ఎదుర్కొనుచున్న శోధన లన్నిటిని యేసుక్రీస్తు ఎదుర్కొనలేదని అట్టి వారు చెప్పుదురు. ఒకవేళ ఆయన ఆ శోధన లన్నిటిని ఎదుర్కొనినచో ఆయనకూడ పాపము చేసియుండును. ఇంకను వారు యిట్లు వాదింతురు: ఆధునిక సమస్యలు, పాపములను యేసుక్రీస్తు ఎదుర్కొని యుండనందున, ఈ జీవితములో వాటి నన్నిటిని వారెట్లు అధిగమింతురని క్రీస్తు గ్రహించును?

యేసుక్రీస్తు ఆయన అపొస్తలులు గూడ ఎదుర్కొనని పలు రకములైన పాపములు నేడు ఈ లోకమందు గలవనుట సత్యమే. ఇంకొక మాటలో చెప్పవలెనన్న, కాలము గడచుకొలది పాపము చేయుటకు మానవుడు అనేక క్రొత్త మార్గములను కనుగొనెను. ఉదాహరణకు పొగ త్రాగుట, చలనచిత్రములు, ఆధునిక మత్తు మందులు, చంపుట కుపయోగించు అత్యాధునిక ఆయుధములు మున్నగునవెన్నిటినో గూర్చి వారికి తెలియదు. అట్టివి రానున్నవని యేసుకు తెలియదని భావమా? అటువంటివి అన్నియున్న కాలములో ఆయన జీవించి యున్నచో నిశ్చయముగా వాటన్నిటిని ఆయన అధిగమించి యుండగలడు.

ఆ దినములలో గల ప్రతి విధమైన పాపమువలన యేసు శోధింపబడెనని దీని భావము గాదు. అప్పటినుండి వచ్చిన పాపములను ఎదుర్కొనుటగూడ గాదు. అయితే మనవలె ఆయన అన్ని విషయముల లోను శోధింపబడినప్పటికి తనలో వాటికి తావు యిచ్చుటద్వారా పాపము చేయలేదు. ఈ లోకములో ప్రతి వ్యక్తి ఎదుర్కొను పాపము లన్నిటిని గూడ మనంతట మనము ఎదుర్కొనలేము. అయినప్పటికి అనేక రకములైన పాపములను మనము ఎదుర్కొనుచున్నాము. ఉదాహరణకు, యోహాను యిట్లు చెప్పెను. "ఈ లోకమునైనను లోకములో ఉన్న వాటినైనను ప్రేమింపకుడి. ఎవడైనను లోకమును

ప్రేమించిన యెడల తండ్రి ప్రేమ వానిలో నుండదు. లోకములో ఉన్న దంతయు, అనగా శరీరాశయు నేత్రాశయు జీవపు డంబమును తండ్రి వలన పుట్టినవి కావు; అవి లోక సంబంధమైనవే. లోకమును దాని ఆశయు గతించిపోవుచున్నవి గాని, దేవుని చిత్తమును జరిగించువాడు నిరంతరము నిలుచును" (1 యోహా 2 15-17).

కాబట్టి లోకములో మూడు ప్రముఖ విధములైన పాపము గలదని విశదమగుచున్నది. అవి శరీరాశ, నేత్రాశ, జీవపుడంబము అనునవియే. ఏది పాపమో, ఏది దోషమో, ఏది శోధనతో కూడు కొనినను అవన్నియు ఒకే విధముగా పాపమునందు యిమిడి యున్నవి కాబట్టి క్రీస్తు ఈ మూడు రకములైన పాపములను ఎదుర్కొనెను. గనుక మన ముందు గల పలు శోధనలను అధిగమించుట ఎట్లో ఆయ నకు తెలియును. మన సమస్యలు, శోధనలు ఆయనకు తెలియును గనుక ఆయన జాలిగల హృదయముతో మనకు సహాయము చేయ వలెనని అభిలషించుచు సర్వదా సిద్ధముగా యున్నాడు.

అందరు ఒకే విధముగా లేదా ఒకే విషయమునందు శోధింప బడరు. కొందరు ఇతరులకంటె బలహీనులు. యేసు దేవుని కుమారుడైనప్పటికి సాతానుచే శోధింపబడు నాటికి ఆయన మానవ శరీరముతో వుండెను. శరీర బలహీనతవలన ఆయన బాధ, ఆకలి, దాహము మున్నగు వాటిని అనుభవించుచు తాను ఎదుర్కొను శోధనలయందు బలముగా పొంది వాటిని జయించెను. తన సొంత శిష్యులలో యొకనిచే అప్పగింపబడి, ఆనాటి మత, పౌరనాయకుల అవహేళనకు, శిక్షకు గురి యగుటకు ఆయన సిద్ధపడుటను గూర్చి యొకసారి ఊహించుము. పిమ్మట ఆయనకు వేదన, సిలువ మరణము సంభవించినది. అట్టి వాటిని ఎంతమంది సహింపగల్గిరి? తండ్రియైన దేవుడు ఆయనకు సహాయము చేయుటకు సిద్ధముగా యున్నాడు. హృద్రోగము, ఈ జీవన బాధలు, యింకను అనేక సమస్యలు, శోధన

లను మనము ఎదుర్కొనునపుడు ఆయనవలె మనము తండ్రివైపు చూచుచున్నామా? యేసుక్రీస్తు మనలను సృష్టించుచున్నాడు గనుక మనము ఎదుర్కొనునదేదో ఆయనకు తెలియును. ఈ విషయములన్నిటిలోను మనము అయన వైపు తేరి చూచినచో ఆయన సహాయము చేయుటకు సిద్ధముగా యున్నాడు.

శోధనలను గూర్చి విపులీకరించు ఈ లేఖనములను కూడ దయచేసి గమనింపుము. "సాధారణముగా మనుష్యులకు కలుగు శోధన తప్ప మరి ఏదియు మీకు సంభవింపలేదు. దేవుడు నమ్మదగినవాడు; మీరు సహింపగలిగినంతకంటె ఎక్కువగా ఆయన మిమ్మును శోధింపబడనియ్యడు. అంతే కాదు, సహింపగలుగుటకు ఆయన శోధనతో కూడ తప్పించుకొను మార్గమును కలుగజేయును" (1 కొరింథి 10:13). "భక్తులను శోధనలోనుండి తప్పించుటకును, దుర్నీతిపరులను తీర్పు దినమున శిక్షింపబడువరకు వారిని కావలిలో నుంచుటకు ప్రభువు సమర్థుడు" (2 పేతు 2:10). "నీవు నా ఓర్పు విషయమైన వాక్యమును గైకొంటివి గనుక భూనివాసులను శోధించుటకు లోకమంతటికి రాబోవు శోధన కాలములో నేనును నిన్ను కాపాడెదను" (ప్రక 3:10). "శోధన సహించువాడు ధన్యుడు; అతడు శోధనకు నిలిచినవాడై ప్రభువు తన్ను ప్రేమించు వారికి వాగ్దానము చేసిన జీవకిరీటము పొందును" (యాకోబు 1:12).

పైన పేర్కొనిన లేఖనములు మనలను బహుగా ప్రోత్సహించుచున్నవి. అవును, మనము కోరినచో మనకు అవసరమైన సహాయమును లేఖనములనుండి పొందగలము. మూర్ఖపు పట్టుదలగలిగి పాపమునకు మనము ఎంత సమీపముగా నుంటిమో గ్రహింపక మనము అధిగమించుటకు వీలుపడని శోధనలతో మిళితమైనట్లయినచో ఇతరులను గాక మనలను మనమే నిందించుకొనవలసియున్నది. అట్టి పరిస్థితిలో గూడ మనము ప్రభువువైపు చూచి ఆయన

సహాయమును ఆర్థించినచో విమోచించుటకు సర్వదా ఆయన సిద్ధముగా యున్నాడని గ్రహింపుము. శోధనలు ఎట్లుండునో ఆయన అనుభవించి వాటిని జయించినందున మన శోధనలలో యేసుక్రీస్తు తన సానుభూతి చూపుట మాత్రమే గాక మనము జయించలేని శోధనలను సహితము జయించుటకు ఆయన సహాయము చేయును.

ప్రపంచములో నీకు మాత్రమే సమస్యలు గలవని, మిగిలిన వారందరికంటె నీ సమస్యలే క్లిష్టమైనవని తలంచుట యొక్క తుణము నిరోధింపుము. మన పరిస్థితులను అవసరములను గూర్చి యోచింపక, యేసుక్రీస్తు సాతానుకంటె తన పనివారందరికంటె గొప్పవాడని గ్రహింపుము. కాబట్టి మనంతట మనము శోధనలు జయించు సామర్థ్యము కలిగియుండకపోవచ్చును. మన తెలివి హీనతవలన కనీసము వాటిని జయించు ప్రయత్నము చేయలేకపోవచ్చును. అయితే ప్రభువు సహాయముతో మనము ఈ జగత్తునందున్న శోధనలను సమస్యలను తేలికగా జయించగలము. ఇది నిష్ఫలమైనదేమో ప్రయత్నించి చూడుము.

---

## రక్షింపబడితినని నేను తెలుసుకొనగలనా?

### *(Can I Know that I'am Saved)*

రక్షింపబడితినని నేను తెలుసుకొనగలనా? నిశ్చయముగా నేను తెలుసుకొనగలను. నేను రక్షింపబడితినో లేదో తెలుసుకొనుట సాధ్యపడునట్లు దేవుడు చేసెను గనుక నా రక్షణను గూర్చి నాకు సందేహముగాని ఆశ్చర్యముగాని లేదు. "దేవుని కుమారుని నామమందు విశ్వాసముంచు మీరు నిత్యజీవము గలవారని తెలిసికొనునట్లు నేను ఈ సంగతులను మీకు వ్రాయుచున్నాను" (1 యోహాను 5:13).

మన సత్ క్రియలు, నైతిక సత్ప్రవర్తన, తలంపులపై మన

రక్షణ ఆధారపడి యుండలేదని తెలిసికొనుము. అయితే రక్షణ దేవుని వాక్యముపై ఆధారపడి యున్నది. నేను దేవునితో రక్షణ బాంధవ్యమును కలిగియుంటినని నా బైబిలు వలన గ్రహించితిని.

నేను పాపినై యుంటినని నా బైబిలు గ్రంథము బయలుపరచినది. "అందరు పాపముచేసి దేవుడు అనుగ్రహించు మహిమను పొందలేక పోవుచున్నారు" (రోమా 3:23).

నేను పాపినని నన్ను నేను రక్షించుకొనజాలనని పాపమువలన వచ్చు జీతము మరణమని నేను గ్రహించినపుడుగూడ దేవుడు యింకను నాకు నిత్యజీవమును అనుగ్రహించునని తెలిసికొని బహుగా ఆనందించుచున్నాను. "పాపమువలన వచ్చు జీతము మరణము; అయితే దేవుని కృపావరము మన ప్రభువైన యేసుక్రీస్తునందు నిత్యజీవము" (రోమా 6:23).

## విశ్వాసము—కృప

నిత్యజీవమను వరమునుగూర్చి ఎఫెసీ పత్రిక వివరించుచున్నది. "మీరు విశ్వాసముద్వారా కృపచేతనే రక్షింపబడియున్నారు; ఇది మీ వలన కలిగినది కాదు, దేవుని వరమే" (ఎఫెసీ 2:8, 9). అది క్రియలవలన కలిగినది కాదు గనుక ఎవడును అతిశయపడ వీలులేదు. మనము కృపవలన మాత్రమే రక్షింపబడితిమని ఈ లేఖనములు తెల్పుటలేదని గ్రహింపుము. విశ్వాసముద్వారా కృపవలననే రక్షింపబడితిమి. అనగా కృప దేవుని భాగము, విశ్వాసము మానవుని భాగము.

అనేకులు తమకు విశ్వాసము గలదని తలంచుదురు. అయితే విశ్వాస మనగా నేమో వారు నిజముగా ఎరుగరు. అది కేవలము వివేకముతో కూడిన నమ్మిక కాదు. ఏలయనగా "దయ్యములును నమ్మి వణకుచున్నవి" (యాకోబు 2:19). లేదా మన భౌతిక అవసరములకొరకు క్రీస్తుపై ఆధారపడి నమ్ముటకూడ కాదు. మనలను

మనము నమ్మకపోనక, మన సత్క్రియలు, నైతిక సత్ప్రవర్తనలను ఆధారము చేసికొనక నిత్యరక్షణ కొరకు క్రీస్తుపై ఆధారపడుటయే. రక్షించునది విశ్వాసమని తెలుసుకొనుము. నేను నా జీవితమును నా ఇష్టమైన రీతిలో నడిపించుకొనుట మాని ఎప్పుడైతే యేసుక్రీస్తును నా జీవితపు యజమానిగా అనుమతించుదునో అదే విశ్వాసము. మన సొంత సత్క్రియలకంటె అధికముగా యేసుక్రీస్తును ఆధారము చేసికొనుటయే యని దీని భావము.

పిమ్మట విశ్వాసపు నిశ్చయము గలదు. అనగా ఎప్పుడైతే మనము పాపముచేయుట మానవలెనని నిశ్చయించుకొందుమో, దీనినే మనము మారుమనస్సు అని చెప్పుచుందుము.

అటు పిమ్మట, విశ్వాసపు ఒప్పుకోలు - అనగా యేసుక్రీస్తు సజీవమైన దేవుని కుమారుడు అని నీ నోటితో ఒప్పుకొనుట. "కాబట్టి మనుష్యుల యెదుట ఎవడు నన్ను ఒప్పుకొనునో పరలోకమందున్న నా తండ్రి యెదుట నేనును వానిని ఒప్పుకొందునని" యేసు చెప్పెను (మత్త 10:32).

చివరగా విశ్వాసపు నిర్ధారణగూడ గలదు. విశ్వాసమునకు లోబడుటద్వారా మనము లోకమునకు దాని నిర్ధారణను చూపుచున్నాము. దేవుడు ఏమి చెప్పినను ఎదురు ప్రశ్నింపక దానిని చేయుటయే "విశ్వాసమని" యొక చిన్న పిల్ల నిర్వచించినది. హెబ్రీయులకు వ్రాసిన పత్రిక 11వ అధ్యాయములో అనేక మంది విశ్వాసపు నాయకులను గూర్చి చదువ గలము. ప్రతి సందర్భములోను వారు విశ్వాసమునకు విధేయులైనట్లు చూడగలము. విశ్వాసమును బట్టి హేబెలు శ్రేష్ఠమైన బలి అర్పించగలిగెను. విశ్వాసమును బట్టి హనోకు దేవునితో నడిచెను. నోవహు విశ్వాసమును బట్టియే ఓడను నిర్మించెను. విశ్వాసమువలననే అబ్రాహాము ఇస్సాకును అర్పించుటకు సిద్ధపడెను. అట్టి విశ్వాసమునకు లోబడుట వలననే మనము బాప్తిస్మమను అజ్ఞకు గూడ లోబడుచున్నాము.

"కాబట్టి మీరు మారుమనస్సు నొంది పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడును యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి" (అ.కా. 2:38). "గనుక నీవు తడవు చేయుట ఎందుకు?" లేచి ఆయన నామమును బట్టి ప్రార్థన చేసి బాప్తిస్మము పొంది నీ పాపములను కడిగివేసికొనుమని చెప్పెను" (అ.కా. 22:16). "బాప్తిస్మము యిప్పుడు మిమ్మును రక్షించుచున్నది" (1 పేతురు 3:21).

రక్షింపబడితినని నేను తెలిసికొనగలనా? విశ్వాసము ద్వారా దేవుని ఆహ్వానమును నేను అంగీకరించినచో "అవును" అని జవాబు చెప్పకొనగలను. విశ్వాసమును గూర్చిన నిశ్చయము, విశ్వాసపు ఒప్పుకోలు నేను చేసియున్నచో, విధేయతద్వారా గూడ నా విశ్వాసమును చూపగలను.

—రోయ్ బీస్లే.

---

## ప్రజావాణియే దైవ వాణి?

## *(Vox Populi Vox Dei?)*

"జన వాక్యమే దేవుని వాక్యము" యని పూర్వము గ్రీకులు రోమనులు తమ న్యాయ సంబంధ వ్యవహారాల్లో అంటుండేవారు. దీనికి తుల్యమైన అభిప్రాయాన్ని కొందరు రాజనీతిజ్ఞులు తమ గ్రంథాల్లో వెలిబుచ్చారు. బహుశ లౌకిక పరమైన విషయాల్లో అది నిజమే కావచ్చు. ఎందుకంటే అధిక సంఖ్యాకుల ఆమోదము చెలామణి అవుతాది.

ఆధ్యాత్మిక సంబంధమైన విషయాలలో కూడ పలువురు యిట్టి అభిప్రాయాన్ని కల్గియుండి, తమ స్వాభీష్టాను సారముగా వ్యవహరించడం దేవుని చిత్తానుకూలమా? శిష్టార్హమా?

### బాబెలు గోపురం కట్టుచున్నవాడు

మానవులు భూమియందంతట విస్తరించుట దేవుని నిర్ణయం

కాగా, "వారు మనము భూమియందంతట చెదరిపోకుండ ఒక పట్టణము నకు ఆకాశము నంటు శిఖరముగల గోపురము కట్టుకొని పేరు సంపా దించుకొందము రండని మాటలాడుకొనిరి". కాని "అక్కడ యెహోవా భూజనులందరి భాషను తారుమారు చేసెను. అక్కడనుండి యెహోవా భూమియంతట వారిని చెదరగొట్టెను" (ఆది11:4-9). ప్రజలయొక్క యిచ్ఛతో దేవుడు ఏకీభవించలేదు.

## కనానుకు పయనిస్తున్న ఇశ్రాయేలీయులు

మోషే సీనాయి పర్వతముపై ఉండగా, ఇశ్రాయేలీయులు "తమ హృదయములో ఐగుప్తుకు పోగోరినవారై" (అపొ. 7:39), "మా ముందర నడచుటకు ఒక దేవతను మా కొరకు చేయుము" (నిర్గమ 32:1) యని అహరోనుతో అన్నారు. "ప్రజలు విచ్చల విడిగా తిరిగిరి..." (నిర్గమ 32:25). "వారొక దూడను చేసుకొని ఆ విగ్రహమునకు బలి అర్పించి తమ చేతులతో నిర్మించిన వాటియందు ఉల్లసించిరి" (అపొ. 7:41). ఆ దినమున "ప్రజలలో యించుమించు మూడు వేలమంది కూలిరి" (నిర్గమ 32:28). "దేవుడు వారికి విముఖుడాయెను" (అపొ. 7:42).

## పిలాతు సమక్షమందున్న ప్రజలు

"వారందరు - వీనిని చంపివేసి మాకు బరబ్బను విడుదల చేయ మని ఏకగ్రీవముగా కేకలు వేసిరి;...వారు - వీనిని సిలువ వేయుము-సిలువేయుము అని కేకలు వేసిరి; ..వారొకే పట్టుగా కేకలు వేసి, వీనిని సిలువ వేయుమని అడుగగా వారి కేకలే గెలిచెను; కాగా వారడిగినట్టే జరుగ వలెనని పిలాతు తీర్పుతీర్చి ..యేసును వారి కిష్టము వచ్చినట్లు చేయుటకు అప్పగించెను" (లూకా 23:18-25).

సర్వ మానవుల ఆధ్యాత్మిక ముక్తికై క్రీస్తు మృతినొందుట భావ్యమే యైనను ప్రజలు అబద్ధాన్ని సమర్థించి, అన్యాయానికి మద్దతు నిచ్చి హత్యకు తోడ్పడ్డారు. గనుకనే పెంతెకొస్తునాడు

పేతురు యొక్క ప్రసంగాన్ని విని హృదయాల్లో నొచ్చుకొని "సహోదరులారా, మేమేమి చేతుమని" అడిగారు (అపొ. 2:37).

## సారాంశం

జలప్రళయము యిక యెన్నటికి సంభవింపదని దేవుడు వాగ్దానం చేసినా నమ్మక గోపురం నిర్మించుకొని తమను తామే రక్షించుకొబూనుకొన్నారు. సహజ సంపద పుష్కలంగాయున్న కనానును వాగ్దాన భూమిని మనస్కరింపక ఇశ్రాయేలీయులు ఐగుప్తుకు పోగోరారు. సత్యాన్ని నిర్మొహమాటముగా బోధించిన క్రీస్తును సిలువవేసి చంపారు.

పై మూడు దృష్టాంతములలో మెజారిటీ ప్రజలు తమ యిచ్ఛను నెరవేర్చుకో జూచినా, దేవుడు ఆ మెజారిటీతో ఏకీభవించ లేదు. అట్లనే నేడు మెజారిటీలో యున్న క్రైస్తవ శాఖలతో దేవునికి సంతోషంలేదు, వారి సేవకు దేవునికి సంబంధమే లేదు. అధిక సంఖ్యలో యున్న శాఖలు సాతాను సంకల్పానికి చిహ్నం :

"ఇరుకు ద్వారమున ప్రవేశించుడి; నాశనమునకుపోవు ద్వారము వెడల్పును, విశాలమునై యున్నది; దాని ద్వారా ప్రవేశించువారు అనేకులు. జీవమునకుపోవు ద్వారము ఇరుకును, సంకుచితమునై యున్నది; దాని కనుగొనువారు కొందరే" (మత్తయి 7:13, 14).

## క్రైస్తవుల కర్తవ్యం

క్రైస్తవ్యం లేక క్రీస్తు మార్గం ప్రజలు సాధించి సంపాదించినది కాదు. గాని అది క్రీస్తు ఈ లోకానికి వేతెంచిన లక్ష్యం, దైవ సంకల్పం, క్రీస్తు తన జీవితం ద్వారా కనుపరచిన ఆదర్శం, ఆయన తన స్వరక్తాన్ని అర్పించి వేసిన ముక్తిమార్గం. క్రీస్తు అడుగుజాడలో నడచుటయే క్రైస్తవ్యం ఆధ్యాత్మిక రక్షణకు యిదే శరణ్యం.

క్రీస్తు మార్గం క్రీస్తు యొక్క నిరంకుశ స్వామ్యం లేక ఏక

ధర్మాధిపత్యం ఆయన చట్టం సర్వసంపూర్ణం, సవరణలకు అతీతం, ఎల్లరకు సర్వదా శ్రేయస్కరం, ఎన్నటికి తాజా సందేశం. క్రొత్త నిబంధన ద్వారా క్రీస్తు శాసిస్తే క్రైస్తవులు శిరసావహించాలి.

అంటే క్రైస్తవ్యం క్రైస్తవుల యిచ్చానుకూలంగా మలచుకొనేది కాదు, క్రైస్తవ మతం అసలేకాదు. క్రైస్తవుల అభిప్రాయాలకు తావేలేదు. క్రొత్త నిబంధనకు వ్యతిరిక్తంగా నిర్దేశించి ఆదేశించే హక్కు అర్హత యే క్రైస్తవునికి లేదు. ఆధ్యాత్మిక సమస్యల పరిష్కారంలో అంతిమ అధికారం తుది తీర్మానం క్రొత్త నిబంధనదే. దాన్ని గైకొనుటయే క్రైస్తవుల విధ్యుక్తం.

## మరి నీవో.... ?

దేవుని వాక్కును విస్మరించి స్వసంకల్పాన్ని బట్టి ప్రవర్తించిన బాబెలు గోపుర నిర్మాణికుల వలెనే నీవును ఒక మానవ సంఘాన్ని నిర్మిస్తున్నావా? లేక ముఠా తత్వాన్ని ప్రోత్సహిస్తున్నావా? నీ ఆధ్యాత్మిక గమ్యము 'తారుమారు' కాగలదు...జాగ్రత్త!

జీవముగల దేవుని వాక్కును లక్ష్యపెట్టక బంగారు దూడను చేసి పూజించిన ఇశ్రాయేలీయులవలె, దేవునికి విరోధమైన విభజనకు లేక క్రైస్తవ శాఖలకు పత్తాసు పల్కుచున్నావా? నీ ఆత్మను రెండవ మరణానికి గురిచేసుకొంటున్నావు...సుమా!!

పిలాతు సమక్షమందుండిన మూకవలె సత్యాన్ని చంపి సమాధి చేయుటకు, దొంగ బోధకులు స్వేచ్ఛగా నాలుకలాడించుటకు దోహదం చేస్తున్నావా? క్రీస్తును సిలువ వేయమని కేకలు వేసిన సమూహము నకు లేఖనాలనుండి పెంతెకొస్తునాడు పేతురు బోధింపగానే, సత్యాన్ని అంగీకరించి క్రీస్తు సంఘమునకు చేర్చబడ్డారు (అపొ. 2 : 41). నీవును వారివలెనే లోగడ మూర్ఖముగా ప్రవర్తించినా, నేడు మనస్సు మార్చుకొని, క్రీస్తు సంఘసభ్యుడవు కమ్ము ...!!!

— ప్రభుదాస్ సబ్బతి, నిజామాబాద్.

# సువార్తను ప్రకటించుట

## (*Preaching the Gospel*)

"కాబట్టి మీరు వెళ్లి, సమస్త జనులను శిష్యులనుగా చేయుడి; తండ్రియొక్కయు, కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మమిచ్చుచు నేను మీకు ఏయే సంగతులను ఆజ్ఞాపించితినో వాటినన్నిటిని గైకొనవలెనని వారికి బోధించుడి. ఇదిగో నేను యుగ సమాప్తి వరకు సదాకాలము మీతోకూడ ఉన్నానని యేసు వారితో చెప్పెను" (మత్తయి 28:19, 20) 'మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి. నమ్మి బాప్తిస్మము పొందిన వాడు రక్షింపబడును; నమ్మని వానికి శిక్ష విధింపబడును' అని కూడ క్రీస్తు చెప్పెను (మార్కు 16:15, 16).

ఈ వాక్యములలో కొన్ని సంగతులు పరిశీలించ గోరుచున్నాము :

1. అపొస్తలులను వెళ్లుడి యని యేసు ఆజ్ఞాపించెను. ప్రభువు అపొస్తలులను వెళ్ళుడి అని మాత్రమే గాక ఎక్కడికి వెళ్ళవలెనో కూడ చెప్పెను. ఆయన వారిని సర్వలోకమునకు వెళ్ళవలెనని చెప్పెను, లోకములోని ప్రతి జనాంగమునకు, లోకములో నున్న జనాంగములలో ప్రతి సృష్టికి యని చెప్పెను. అనగా ఎవరినీ విడువకుండగ ప్రతి మనుష్యునికి సువార్త ఉద్దేశించబడెను. ఆ దినములలో సరియైన ప్రయాణ సౌకర్యములులేవు. ఈ దినములలోవలె ప్రయాణించుట ఆనాడు కష్టమైనను ప్రభువు వారికి వెళ్లుడి యని ఆజ్ఞాపించెను; ఆయన అసాధ్యమైనవి చేయమనడుగదా.

2. మీరు వెళ్ళి ప్రకటించుడి అని అపొస్తలులను యేసు ఆజ్ఞాపించెను.

వారిని ప్రకటించుడి యని ఆజ్ఞాపించినపుడు ఆయన వారికి ప్రకటించవలసిన దేమియో స్పష్టము చేసెను. సువార్తను ప్రకటించుడి

యని ఆయన చెప్పి, అందు ఏమియు సందేహముండకుండ వారికిట్లు స్పష్టముగా చెప్పెను: "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును; నమ్మని వానికి శిక్ష విధింపబడును" (మార్కు 16:16).

**3. సువార్తకు విధేయులైన వారికి బాప్తిస్మము ఇయ్యుడి అని యేసు అపొస్తలులతో చెప్పెను.**

సర్వలోకమునకు సువార్తను తీసుకొని వెళ్ళవలసినదిగా ప్రభువు శిష్యుల కాజ్ఞాపించుటకు ముందుగా జ్ఞాపకముంచుకొనుము. వారి బాధ్యత జనులు సువార్తను నమ్మునట్లు చేయుట, మరి అట్టి ఇతర సంగతులు కాదుకాని, సువార్త అందరకూ ప్రకటించబడునట్లు చేయుటయే. సువార్త ప్రకటించబడినతర్వాత దానికి విధేయులైనవారు ఎవరైన యున్న యెడల, అప్పుడు వారికి బాప్తిస్మ మీయవలసినదిగా ప్రభువు చెప్పెను. అప్పుడు ఆయన ఒక మెట్టు ముందుకు వెళ్ళి ఏ పద్ధతిలో వారు బాప్తిస్మము పొందవలెనో వారికి చెప్పెను. "తండ్రియొక్కయు, కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మ మియ్యుడి" (మత్తయి 28:19) అని ఆయన చెప్పెను. ప్రభువు ఈ విషయములో ఎట్టి తప్పుడు అర్థము ఉండకూడదని కోరెను.

**4. ఆఖరుగా సువార్తకు విధేయులైన వారికి ఎక్కువగా బోధించవలెనని వారికి ఆజ్ఞాపించెను.**

ఇక్కడ గుర్తించుము; సర్వలోకమునకు వెళ్ళి సర్వజనులకు సువార్తను ప్రకటించుట, ప్రభువును అంగీకరించిన వారికి బాప్తిస్మ మిచ్చుట ప్రభువుయొక్క ఆజ్ఞ అయి యున్నది. ఒకసారి ఇది జరిగిన తరువాత మరియొక బాధ్యత ఆసన్నమగుచున్నది; అది ప్రభువు వాక్య ప్రకారము, "నేను మీకు ఏ యే సంగతులను ఆజ్ఞాపించితినో వాటి నన్నిటిని గైకొనవలెనని వారికి బోధించుడి: ఇదిగో నేను యుగసమాప్తి వరకు సదా కాలము మీతోకూడ ఉన్నానని వారితో చెప్పెను" (మత్తయి 28:20). ప్రభువు ఎట్టి పరిస్థితినైనను, ఏ మార్గమున వెళ్ళి

నను సముదాయించుటకు వీలుగ తగు జాగ్రత్త తీసికొనినట్లు అర్థమగుచున్నది. సువార్తలోని మొదటి సూత్రములకు విధేయులైనవారు ఆత్మీయముగా నశించిపోవుట ఆయన యుద్దేశము కాదు. కాని వారు మిగతా సంగతులు బోధించబడి క్రైస్తవ జీవితము జీవించువారిగా నేర్పించబడవలెనని ఆయన యుద్దేశము. ఈవిధముగా చేయుటలో వారి ప్రస్తుత రక్షణయేగాక నిత్యజీవము పొందవలెనని కూడ ఆయన శ్రద్ధ తీసికొనెను. వారు విశ్వాసయుతమైన క్రైస్తవ జీవితము జీవించుటకు సిద్ధపడవలెనని ఆయన కోరిక. ఇది అదనముగా బోధించుట ద్వారానే జరుగును.

ఈపైన పేర్కొనినవి గొప్ప ఆజ్ఞగా పరిగణింపబడుచున్నవి. ఎందుకనగా ఈ సువార్త లోక మంతటికిని ఆత్మలను రక్షించు గొప్ప సందేశమై యున్నది. ఇంకా ముందుకు జరిగిన, ఈగొప్ప ఆజ్ఞ ఎట్లు పాటించబడవలెనో ప్రభువు యెట్లు ఉద్దేశించెనో మనము చూడగోరుదుము. అ. కా. 1:8లో చూచిన ఈగొప్ప ఆజ్ఞను నెరవేర్చుటలో ప్రభుని ప్రణాళికలో భూగోళ సంబంధమైన మెట్లు చూడగలము. ఆయన అపొస్తలులతో మాట్లాడిన యుపదేశములు చూడుము; "అయినను పరిశుద్ధాత్మ మీ మీదికి వచ్చినప్పుడు మీరు శక్తి నొందెదరు గనుక యెరుషలేములోను, యూదయ సమరయ దేశముల యందంతటను భూదిగంతముల వరకును, నాకు సాక్షులై యుందురని వారితో చెప్పెను." అపొస్తలుల కార్యముల గ్రంథము మనము చదువునప్పుడు ఈ విధముగనే జరిగినట్లు కనుగొందుము. ఇది కొంచెము దగ్గరగా పరిశీలింతము :

1. సువార్త బోధించునప్పుడు ఇది యెరుషలేములో మొదలు పెట్టవలసి యున్నది.

అపొస్తలుల కార్యములు 1, 2 అధ్యాయములు చూచిన ఈ సన్నివేశము కలదు : అపొస్తలులు యెరుషలేములో యుండిరి, పెంతె

క్రీస్తు దినము ఆసన్నమైనది. లోకములోని యూదులందరు అచటకు చేరిరి. అపొస్తలులపై పరిశుద్ధాత్మ కుమ్మరించబడెను, అంతట అపొస్తలులందరు నానాభాషలు మాట్లాడ శక్తిగలవారైరి, అక్కడకు జేరిన వివిధ దేశస్తులతోను వారివారి భాషలతో వారు మాట్లాడిరి, మరియు మొట్టమొదటిగా వారికి సువార్త ప్రకటించబడెను. దీని ఫలితముగా సుమారు 3000 మంది నమ్మి సంతోషముతో బాప్తిస్మము పొంది, సంఘములో చేర్చబడిరి. ఈ క్షణమునుండి సువార్త ప్రబలుట మొదలుపెట్టెను. ఈ సమయములో సువార్త ప్రకటించబడుట ప్రభువుయొక్క జ్ఞానమును సూచించుచున్నది, ఎందుకనగా లోకమంతటినుండి జనులు అచ్చటకు పోగుచేయబడి వారు విశ్వసించినపిదప వారివారి స్థలములకు వారు తిరిగి వెళ్లి, అక్కడ సువార్తను ప్రకటించిరి. రోమానుండి వచ్చిన అన్యులు హాజరగుట చూడుము. తరువాత రోమాలో సంఘము పౌలు రోమాకు వెళ్ళక పూర్వమే యున్నట్లు మనము చదువుదుము - లేఖనములలో పేతురుగాని మిగతా అపొస్తలులుగాని ఈ కాలమునకు ముందుగా వెళ్ళినట్లు కనబడదు. కనుక దీని సంజాయిషీ ఏమి? రోమానుండి వచ్చిన పరదేశీయులు సువార్తను అంగీకరించి, వారి గృహములకు తిరిగి వెళ్ళి వారి జనులకు సువార్తను ప్రకటించుటద్వారా అక్కడ సంఘము స్థాపించబడెను.

2. సువార్త యూదయ యందంతట ప్రకటించబడవలెను. యూదయ అనగా యెరూషలేము చుట్టూయున్న ప్రాంతము. అనగా ఆ చుట్టుపట్ల యున్నవారికి బోధించుట సమస్య కాదు. కనుక కాలక్రమేణా సువార్త యెరూషలేములోను, యూదయ యందంతటను సువార్త ప్రకటించబడెను. అప్పుడు మనము స్తెఫెనుయొక్క మరణమునుగూర్చి చదువుదుము, "సౌలు అతని చావునకు సమ్మతించెను. ఆ కాలమందు యెరూషలేములోని సంఘమునకు గొప్ప హింస కలిగినందున, అపొస్తలులుతప్ప అందరు యూదయ సమరయ దేశముల

యందు చెదరిపోయిరి" (అపొ.కా. 8:1). ఇట్లు ముందుకుపోయిన చెదరి పోయినవారిని గూర్చి చదువుదుము, "కాబట్టి చెదరిపోయిన వారు సువార్త వాక్యమును ప్రకటించుచు సంచారము చేసిరి" (అ.కా. 8:4). కావున సువార్త యూదయ యందంతట బోధించబడెను.

3. సువార్త ఇప్పుడు సమరయ వారికి తీసుకొని వెళ్లవలసి యున్నది.

"అప్పుడు ఫిలిప్పు సమరయ పట్టణమువరకును వెళ్లి క్రీస్తును వారికి ప్రకటించుచుండెను. జనసమూహములు ఫిలిప్పు చేసిన సూచక క్రియలను చూచినందున అతడు చెప్పిన మాటలయందు ఏక మనస్సుతో లక్ష్య ముంచిరి" (అ. కా. 8 : 5, 6). "అయితే ఫిలిప్పు దేవుని రాజ్యమును గూర్చియు, యేసుక్రీస్తు నామమును గూర్చియు సువార్త ప్రకటించుచుండగా వారతనిని నమ్మి, పురుషులును, స్త్రీలును బాప్తిస్మము పొందిరి" (అ. కా. 8:12). తరువాత పేతురును, యోహానును వారిని సందర్శించినపుడు లేఖనములలో ఇట్లున్నది: "అంతట వారు సాక్ష్య మిచ్చుచు ప్రభువు వాక్యము బోధించి యెరూషలేమునకు తిరిగి వెళ్ళుచు, సమరయుల అనేక గ్రామములలో సువార్త ప్రకటించుచు వచ్చిరి" (అ.కా. 8:25). కావున ప్రభువు ప్రణాళిక ప్రకారము సమరయవారు సువార్తను వినిరి.

4. ఆఖరుగా లోకమంతటికి సువార్త తీసుకొని వెళ్ళవలసి యున్నది.

లోకమంతటికి సువార్తను తీసుకొనివెళ్ళిరి యనుటకు ఋజువుగా పౌలు ఇట్లు చెప్పెను: "పునాదిమీద కట్టబడినవారై స్థిరముగా ఉండి, మీరు విన్నట్టియు, ఆకాశము క్రింద ఉన్న సమస్త సృష్టికి ప్రకటింపబడినట్టియు ఈ సువార్త వలన కలుగు నిరీక్షణనుండి తొలగి పోక, విశ్వాసమందు నిలిచి యుండినయెడల ఇది మీకు కలుగును. పౌలను నేను ఆ సువార్తకు పరిచారకుడ నైతిని" (కొలస్స 1 : 23).

కావున లోకమంతట సువార్త ప్రకటించబడ వలెనను ప్రభువు యొక్క ప్రణాళిక ముప్పది సంవత్సరముల కాలములోపుననే నెరవేర్చబడెను.

ప్రభువు ఈనాడు మనమేమి చేయవలెనని కోరుచున్నాడు ? మనము కూడ అట్లు సువార్త ప్రకటించవలెననియే ఆయన చిత్తము. అనగా మనకు కూడ సువార్తను లోకమంతటిలోనికి, లోకములోని జనాంగములన్నిటికి, లోకములోని జనాంగములలోని ప్రతి వ్యక్తికి సువార్త నందించవలసిన బాధ్యత యున్నది. ఎక్కువ జనాభా యుండుటవలన మనకు ఎక్కువ పని యున్నదని యనుకొనిన, ఇప్పుడున్న ప్రయాణ, రవాణా సౌకర్యములతో మన పని సులభ సాధ్యము. కాని ప్రభువు మనపై ఈ బాధ్యతను పెట్టెను కావున మనము తప్పక చేయవలెను. మనలను అసాధ్యమైనదేదియు చేయుమని ఆయన కోరడు. లోకమునకు క్రీస్తు సువార్త అవసరము. ఇది లోకమునకు నిరీక్షణ అయి యున్నది. ఇది యొక్కటే దానిని మార్చి, సహాయము చేసి, రక్షించగలదు. సువార్తను కలిగిన మనము లోకమంతటికి సువార్త తప్పక బోధించబడునట్లు చూడవలెను.

— జె. సి. ఛోట్

---

## కాకినాడ బైబిల్ లెక్చర్ షిప్

1987 నవంబరు 10, 11 మరియు 12 తేదీలలో క్షత్రియ పరిషత్ కమ్యూనిటీ హాలు కాకినాడలో బైబిలు లెక్చర్ షిప్ జరిగి యున్నది. బ్రదర్ జాషువా గూటంగారి ఆధ్వర్యంలో జరిగిన ఈ మూడురోజులు బైబిలు లెక్చర్ షిప్‌లో పాల్గొన్న ప్రతిఒక్కరికి మరపురాని మధురమైన మహత్తర క్షణాలు. ఈ బైబిలు లెక్చర్ షిప్‌ను అత్యంత అద్భుతంగాను, మిక్కిలి ఆశీర్వాదకరంగాను

ఆనందంగా జయప్రదంగా నడిపించిన ఇంత ఘనమైన బైబిల్ లెక్చర్ షిప్‌ను ఏర్పాటు చేసిన సారథి బ్రదర్ జాషువా గూటంగారి కృషి ప్రశంసనీయం. అభినందనీయం. ఇది అందరికీ ఆనందదాయకం.

ఆంధ్రరాష్ట్రం నలుమూలలు నుండి కాకుండా ఇతర రాష్ట్రాలు మరియు విదేశాలనుండి కూడ ఈ లెక్చర్ షిప్‌లో 5 లేక 6 వందల మంది సహోదరి, సహోదరులు ప్రతి ఒక్కరూ తమ తమ స్వంత ఖర్చులతో హాజరవ్వడం వూహింప శక్యంకాని విశేషం, సంతోష దాయకమైన సహవాసం.

మొట్ట మొదటి రోజున అనగా 10వ తేదిన "బైబిల్ లెక్చర్ షిప్" ప్రారంభోపన్యాసం "క్రీస్తు యొక్క ప్రభుత్వము" అను అంశం గూర్చి బ్రదర్ జె.సి. బెయిలీ (కెనడా)గారు గంభీరంగా మాట్లాడారు. ఆశ్చర్యపడే విషయం ఏమిటంటే అప్పటివరకు ఉన్న తుఫాన్ వాతావరణం ప్రశాంత వాతావరణంగా మారడం అనంతరం సహో॥ విక్టర్ డేనియల్ తురాక (తెనాలి)గారు "క్రీస్తు ఈ విశ్వానికే ప్రభువై యున్నాడు" అనే దానిని గురించి చక్కగా చెప్పడం జరిగింది.

మధ్యాహ్నం మూడు గంటలు నుండి జరిగిన లెక్చర్ షిప్‌లో బ్రదర్ టి. జ్ఞానానందం (కాకినాడ) గారు "సంఘానికి, గృహానికి క్రీస్తు ప్రభువై యున్నాడు" అను అంశం గూర్చి అద్భుతంగా మాట్లాడగా అనంతరం జేమ్స్ కాక్స్ (U. S. A.) గారు "సంఘంలో నాయకత్వం" గూర్చి విపులంగా విశదీకరించడం జరిగింది.

అదే రోజు సాయంకాలం జరిగిన లెక్చర్ షిప్‌లో "పరిచర్యలో క్రీస్తు యొక్క ప్రభుత్వం" గూర్చి రేండాల్ ఫగాన్స్ (U. S. A.) గారు మనోహరంగా మాట్లాడగా అనంతరం బ్రదర్ ఎస్. టైటస్ (నిజమాబాద్)గారు పట్టణంలో సంఘాన్ని అభివృద్ధి చేయుట ఎట్లు"ను

గూర్చి ఆవేశపూరితంగా వివరణాత్మకంగా గంభీరమైన వర్తమానాన్ని అందించారు.

రెండవరోజు అనగా 11వ తేది ఉదయం స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ డైరక్టర్ బ్రదర్ నెహెమ్యా గూటంగారు "ప్రేమతో సత్యమును ప్రకటించుట" అనే విషయంపై రమ్యంగా, కడు కమనీయంగా మృదు మధురమైన ప్రేమ తత్వాన్ని పరిమళాల్లా వెదజల్లి సత్యాన్ని సంపూర్ణత్వంతో నింపి తమకో ప్రత్యేక స్థానాన్ని బైబిల్ లెక్చర్ షిప్‌లో ఏర్పచుకోవడం అభినందించదగ్గ విషయం. అనంతరం పి. జాన్ (గిద్దలూరు) గారు "ఆత్మతోను సత్యముతోను దేవునికి విధేయులగుటను" గూర్చి ఆహ్లాదకరంగా చక్కటి వాక్యాన్ని చెప్పియున్నారు.

మధ్యాహ్నం బ్రదర్ పి. ప్రకాశం (హైదరాబాద్) గారు "దేవుడు ఆత్మయైయున్నాడు" అనే అంశం గూర్చి వివరించగా అనంతరం బ్రదర్ ఫ్రాన్సిస్ డేవిడ్ (న్యూఢిల్లీ)గారు "స్థానిక సంఘము సజీవముగా యుండాలి" అనే విషయంపై దీటైన వర్తమానం తుఫాన్ కంటే వేగంగా మెరుపులాంటి వాక్చాతుర్యంతో గంభీరంగా మాట్లాడం జరిగింది

అదే రోజు సాయంకాలం బ్రదర్ ఎమ్. సత్యానందం (రాజమండ్రి) గారు "ఆత్మతోను సత్యముతోను కానుక లిచ్చుట"ను గూర్చి, తరువాత "విశ్వాస సహితమైన మంచి పోరాటము పోరాడుము" అను అంశం గూర్చి బ్రదర్ డి. చిరంజీవి (కాకినాడ) గారు మాట్లాడియున్నారు.

ఇక చివరి రోజు అనగా 12వ తేది ఉదయం బ్రదర్ రాండాల్ఫ్ గాన్స్ (U. S. A.) గారు "దేవుని ఆత్మతోను సత్యముతోను ఆరాధించుట"ను గూర్చి మాట్లాడగా అనంతరం బ్రదర్ ఎ. వినయానంద్ (అనకాపల్లి) గారు "స్వయంపోషక సంఘాలను స్థాపించుదాం" అను అంశం గూర్చి ఆవేశ పూరితంగా మాట్లాడి అనేక మంది క్రీస్తు సంఘ

బోధకుల మన్ననలను పొందారు. అనంతరం ఆరోజు మధ్యాహ్నం జరిగిన సమావేశంలో సహోదరులు జేమ్స్‌కాక్స్ (U. S. A.) గారు "సంఘములో నాయకత్వము" గూర్చి మరింత విపులంగా ప్రసంగించారు.

అనంతరం బ్రదర్ బి. ధనరాజు (అమలాపురం) గారు క్రైస్తవ సహవాసమును గూర్చి మాట్లాడడంతో మూడురోజులు లెక్చర్‌షిప్ ముచ్చటగా ముగిసింది. మీా సహవాసంతో నేను కూడ ఏకీభవిస్తున్నా నన్నట్టు ప్రకృతి ఆనందభాష్పాలు కురిపించడం ఈ బైబిల్ లెక్చర్ షిప్‌కు నిండుదనాన్ని ఇచ్చింది.

మూడు రోజులు జరిగిన బైబిలు లెక్చర్ షిప్‌లోను శ్రావ్యమైన మృదు మధుర గానాన్ని ఆలపించి అందరిని ఆకట్టుకున్న తుమ్మపాల, కడలి క్రీస్తు సంఘ సహోదరి సహోదరులకు ప్రశంసలు లభించాయని చెప్పడం అతిశయోక్తి కాదు.

మొదటి రోజు నుండి చివరి వరకు అత్యంత శ్రద్ధాశక్తులతో భక్తి ప్రవృత్తులతో అద్భుతంగా ఘనంగా దిగ్విజయంగా బైబిల్ లెక్చర్ షిప్‌ను నడిపించి క్రీస్తు సంఘస్తులను అందరిని ఒకేచోట సమీాకరించి సమిష్టి పరచి క్రైస్తవ సహవాసంతో సమావేశ పరచిన బ్రదర్ జాషువా గూటంగారి కృషి పట్టుదల అనంతం. క్రీస్తు సంఘ సేవనుగూర్చి ఆయన పడుతున్న తపన అపారం. ఇది జగమెరిగిన సత్యం.

క్రీస్తు సంఘ సేవలో ఇంకా ముందుకు సాగిపోవాలని అందుకు కావలసిన శక్తి సామర్థ్యం దేవుడు ప్రసాదించాలని తద్వారా ధృవతారగా వెలుగొంది భాసిల్లాలని ప్రత్యేక అభినందనలు తెల్పుతూ సెలవు తీసుకుంటుంది ఈ కలం.

— ఇసుకపట్ల ఇజ్రాయెల్

# క్రీస్తు ఈ విశ్వానికే ప్రభువైయున్నాడు

## (*Christ is Lord of the Universe*)

—విక్టర్ D. తురాశ, తెనాలి.

### ఈ విశ్వము

మనము నివసించుచున్న భూమి ఒక గోళము - సూర్యుడు కేంద్రముగా నుండి సూర్యుని చుట్టు వివిధ నిర్ణీత పరిధులలో క్రమముగా తిరుగుచున్న నవగ్రహములలో మన భూమి సూర్యునికి 15 కోట్ల కిలోమీటర్ల దూరముగా నుండి సూర్యుని చుట్టు 1 గంటకు 106000 కిలోమీటర్ల వేగంతో తిరుగుచు 365 దినములలో ఒకసారి సూర్యుని చుట్టి వచ్చును. భూమి తన చుట్టు తాను 24 గంటలలో తిరుగును. భూమధ్య రేఖ వద్ద వేగము 1 గంటకు 1600 కిలోమీటర్లు - సూర్యుడును, తన చుట్టు తిరుగుచున్న గ్రహములకు సూర్యకుటుంబ మని పేరు. సూర్యుడు కూడా నిలకడగా లేడు - తన చుట్టు తాను 25 రోజులలో తిరుగును ఆ విధముగా తిరుగుచు, సూర్యుడు తన కుటుంబముతో సహా గెలాక్సీ కేంద్రము చుట్టు 1 గంటకు 9 లక్షల కిలోమీటర్ల వేగముతో తిరుగుచున్నాడు. మన సూర్యకుటుంబము మాదిరిగానే అనేక లక్షల సూర్యకుటుంబముల గుంపునకు గెలాక్సీ అని పేరు. మన సూర్యకుటుంబమున్నది పాలపుంత గెలాక్సీలో **(*Milky way Gelaxy*)**. మన సూర్యకుటుంబము గెలాక్సీ కేంద్రము చుట్టు 1 పరిభ్రమణము చేయుటకు 20 కోట్ల సంవత్సరములు పడుతుంది - మన పాలపుంత గెలాక్సీతో పాటు 100 కోట్ల గెలాక్సీలు ఈ మహా విశ్వములో నున్నవి. అవియు నిలకడగా లేవు - మన గెలాక్సీ 20 లక్షల కాంతి సంవత్సరముల దూరములో అండ్రోమెడా గెలాక్సీ వున్నది. అచటనుండి చూస్తే మన గెలాక్సీ 1 గంటకు 144000 కిలోమీటర్ల వేగముతో ప్రయాణము చేస్తుంది. అదండీ విశ్వమంటే.

ఇట్టి విశ్వమంతటిని తండ్రియైన దేవుడు తన కుమారుడైన యేసుక్రీస్తు ద్వారాను, ఆయనను బట్టియు, ఆయనయందును సృజించె నని తెలియుచున్నది (రోమా 11:36, 1 కొరింథి 8.6, కొలస్స 1:15-16, హెబ్రి 1:2).

## సృష్టి కర్తయైన దేవుడు

బైబిలు గ్రంథము ఆరంభవాక్యము - "ఆదియందు దేవుడు భూమ్యాకాశములను సృజించెను" అని తెలుపుచున్నది: ఈ వాక్యము లోని 'దేవుడు' అనే మాట హెబ్రీ భాషలో "ఎలోహిం" అని వున్నది - "ఎలోహిం" బహువచనము - ఏకవచనము 'ఎలోయి' లేక 'ఏలీ' (దా॥కీ॥ 22:1, మత్తయి 27:46)-కాని, 'సృజించెను' అనే క్రియ మాత్రము ఏకవచనమునకు చెందుచున్నది గనుక సృష్టి కార్యములో ఒకరికంటె ఎక్కువమంది పాల్గొనినట్లు తెలియుచున్నది. ఆదికాండము 1:26ను బట్టి "దేవుడు-మన స్వరూపమున, మన పోలిక చొప్పున నరులను చేయుదము" అన్న మాట ప్రకారము కూడా, దేవునితో పాటు మరికొందరున్నటుల తెలియుచున్నది. వారు ముగ్గురనియు, వారు తండ్రి, కుమార, పరిశుద్ధాత్మలని మనకు యిప్పుడు తేటపర్చ బడినది. 1 యోహాను 5:7 ప్రకారము పరలోకమందు సాక్ష్యమిచ్చు వారు ముగ్గురున్నారు. వారెవరనగా తండ్రి, వాక్యము, ఆత్మ అను వారు-వారు ముగ్గురును ఏకమై యున్నారనియు, *(English Bible)* 1 యోహాను 5:8 ప్రకారము, ఆ ముగ్గురి ప్రతినిధులుగా, భూలోక ములో ఆత్మయు, నీళ్లును, రక్తము సాక్ష్యమిచ్చుచున్నారనియు ఈ ముగ్గురు ఏకీభవించి యున్నారని తెలియు చున్నది. ఈ ముగ్గురి ఏకత్వ మునే "దేవత్వమని" ***(God head)*** బైబిలునందు వివరించబడినది (అ.కా. 17:29, రోమా 1:20, కొలస్స 2:9). ఈ దేవత్వములో ముగ్గురు వ్యక్తులు ఏకమైయున్నట్లు బైబిలు గ్రంథము పూర్ణముగా వ్రాయబడిన తరువాతనే, ఈ మర్మము బయలు పరచబడినది

(ఎఫెసీ 1 : 9, 3 : 5, 10). వారు విడివిడిగా 'దేవుడు' అని కూడా వ్యవహరింపబడిరి - అనగా తండ్రియైన దేవుడు, కుమారుడైన దేవుడు పరిశుద్ధాత్మయైన దేవుడని-ఈ విధముగా చెప్పుటలో మనకు ముగ్గురు దేవుళ్ళున్నారని కాదుగాని, ఈ ముగ్గురి కలయికయే దేవత్వ మనబడిన "ఏక దేవుడు". మన భాషలో దీనిని వివరించు సరియైన పదములు లేనందున దీనిని గ్రహించుట మనకు కొంచెము కష్టముగానే యుండును. దీనిని విశదీకరించుటకు ప్రతిశతాబ్ధమునందు ప్రయత్నములు జరుగుచునే యున్నవి. మూడవ శతాబ్ధములో 'సెబెలియస్' అను బైబిలు పండితుడు చెప్పినదేమనగా పరలోకములో 'ఈ ముగ్గురు' ఏకత్వములో నుండినను మన లోకములో వారు మూడు విధములుగా ప్రత్యక్షపరచుకొనినట్లు అనగా సృష్టి నుండి క్రీస్తు పుట్టుక వరకు, తండ్రియైన దేవుడు యెహోవాగాను, యేసుక్రీస్తు రూపములో మానవుడుగా, కుమారుడైన దేవుడును, పెంతెకోస్తు పండుగనుండి రెండవ రాకడ వరకు ఆత్మరూపముగా, పరిశుద్ధాత్మ దేవుడు తమ తమ పనులు నిర్వహించిరని తెలిపెను. తరువాత శతాబ్దములలో 'మోనార్కీయిజం' బయలుదేరినది అది "ఏక దేవుని" సిద్ధాంతమని కూడా పిలువబడినది (Unitarianism). యెహోవాయే దేవుడు-క్రీస్తు దేవుడు కాదు, మానవుడు మాత్రమే-ఆయనను దేవుడు అభిషేకించి మానవులను రక్షించే బాధ్యతను అప్పగించి, తన కుమారునిగా మాత్రమే అంగీకరించెను - అనునది. ఈ 20వ శతాబ్దములో కూడా ఈ సిద్ధాంతమును అనుసరించు వారనేకులున్నారు. కావాలంటే కొత్తనిబంధన నుండి కూడా ఋజువు చేయగలమని అనుచున్నారు- మనము బాప్తిస్మము పొందేటప్పుడు, యిచ్చేటప్పుడు విశ్వాసిని ఏమి ప్రశ్నించుచున్నాము? "యేసుక్రీస్తు దేవుని కుమారుడని నమ్ముచున్నావా?" అనే కదా యేసు క్రీస్తు దేవుడని నమ్ముచున్నావా అనికాదుగదా అని బైబిలు నందలి తమ అజ్ఞానమును చాటి చెప్పు కొనుచున్నారు.

పాతనిబంధన వ్రాయబడిన హెబ్రీభాషలో "యెహోవా" అనగా 'ఉన్నవాడు' 'ఎల్లప్పుడు ఉండువాడు, నిత్యము జీవించువాడు' అని అర్ధము - "దేవత్వము" లోని తండ్రికి కుమారునికి, పరిశుద్ధాత్మకు కూడా 'యెహోవా' అని వ్యవహరించబడినది. తండ్రియైన యెహోవా, కుమారుడైన యెహోవా, పరిశుద్ధాత్మయైన యెహోవా లేక యెహోవా ఆత్మ అని హెబ్రీ భాషలో వాడబడియున్నది. హెబ్రీలో ఆది 19:24 నందు - (1) వెయెహోవా, (2) మీత్ యెహోవా అని రెండుమాటలు వాడబడినవి. వాటి ప్రకారము ఆ వచనము "అప్పుడు కుమారుడైన యెహోవా (1) సొదొమ మీదను గొమొర్రామీదను, తండ్రియైన యెహోవా (2) యొద్ద నుండి గంధకమును అగ్నిని ఆకాశమునుండి కురిపించి" అని వున్నది యిర్మియా 23:6 నందు - క్రీస్తు విషయము ప్రవచించుచు ఆయనకు "నీతియగు యెహోవా" (యెహోవా సిద్కేను) అని పేరు పెట్టుదురు అని (రిఫరెన్సు బైబిలు నందు కూడా) వున్నది. లూకా సువార్త నందు-క్రీస్తువారు నజరేతునకు వచ్చి సమాజమందిరములో చదువుటకు నిలబడినపుడు, యెషయా గ్రంథము ఆయన చేతికియ్యబడెను - "ప్రభువు ఆత్మ నామీదనున్నది, బీదలకు సువార్త ప్రకటించుటకు ఆయన నన్ను అభిషేకించెను ..." అని చదివి, నేడు మీ వినికిడిలో ఈ లేఖనము నెరవేరినదని వారితో చెప్పెను (లూకా 4:16-21), అది పాతనిబంధనలోని తనను గూర్చిన ప్రవచనమని క్రీస్తు చెప్పెను (యెషయ 11 : 2, 42 : 1, 61 : 2-2). మత్తయి 3:16 నందు - "యేసు బాప్తిస్మము పొందిన వెంటనే నీళ్ళలో నుండి ఒడ్డునకు వచ్చెను; ఇదిగో ఆకాశము తెరువబడెను, దేవుని ఆత్మ పావురమువలె దిగెను" ఇచట దేవుని ఆత్మ అని నప్పుడు, అది తండ్రియైన దేవుని ఆత్మకాదు ఎందుకనగా అదేసమయములో "ఈయనే నా ప్రియకుమారుడని" తండ్రి చెప్పుచున్నాడు (3:17). గనుక దేవుని ఆత్మ అనగా ఆత్మయైన దేవుడని

అర్థము, అదే పరిశుద్ధాత్మయని (మార్కు 1 : 10, లూకా 3 : 22, యోహాను 1 : 32) నందు కలదు. గనుక యెషయ 11:2 ప్రకారము అది యెహోవా ఆత్మ అనగా ఆత్మయైన యెహోవా అని తెలియు చున్నది. ఇంకను యిట్టి వాక్యములు అనేకములు కలవు. హెబ్రీ 1 : 8 నందు-దేవుడే తన కుమారుని దేవా అని పిలుచుచున్నాడు. ఇది దా॥ కీ॥ 45 : 6-7 లోని ప్రవచనము. అచట 'దేవా' అను మాట 'ఎలోహిం'గా వ్రాయబడినదిగా గమనించవలెను- గనుకనే హెబ్రీ గ్రంథకర్త ఏ సంశయము లేకుండ 'దేవత్వము' లోని రెండవ వ్యక్తియైన ఏసుక్రీస్తును కూడా 'దేవుని' గానే చెప్పినాడు. మరల హెబ్రీ 1 : 10 నందు ప్రభువా, నీవు ఆదియందు భూమికి పునాది వేసితివి, ఆకాశములు కూడా నీ చేతిపనులే అని క్రీస్తును గూర్చి చాలా విపులంగాను, స్పష్టముగాను చెప్పబడినది-గనుక "దేవత్వము" (God head)లో మొదటి వ్యక్తి తండ్రి, రెండవ వ్యక్తి కుమారుడైన యేసుక్రీస్తు, మూడవ వ్యక్తి పరిశుద్ధాత్ముడు. రెండవ వ్యక్తియైన, కుమారుడైన, యేసుక్రీస్తు ద్వారాను, ఆయన మూలముననను ఆయన కొరకు యీ సృష్టి, మానవులుకూడా కలిగియున్నారు. (రోమా 11:36), మనకు ప్రభువు ఒక్కడే. ఆయన యేసుక్రీస్తు, ఆయన ద్వారా సమస్తమును కలిగెను; మనము ఆయన ద్వారా కలిగినవారము - అయితే కొందరి యందు ఈ జ్ఞానము లేదని 1 కొరింథి 8 : 6-7 నందు చదువగలము.

జగత్తు పునాది వేయబడకమునుపే, దేవుడు తన చిత్తానుసారముగా చేసిన నిర్ణయము చొప్పున సమస్త కార్యములను జరిగించు చున్నాడు (ఎఫెసీ 1 : 12) అందులో భాగముగానే క్రీస్తు మానవుల రక్షణార్థమై, అమూల్యమైన తన రక్తముచేత, అనగా నిర్దోషమును, నిష్కళంకమునగు గొఱ్ఱెపిల్లవంటి క్రీస్తురక్తముచేత విమోచించబడుదుమని ఆయన జగత్తు పునాది వేయబడకమునుపే నియమింపబడెను. (1 పేతురు 1:19-20). కాగా జగత్తు పునాది వేయబడినప్పుడే

ఆయన కార్యములన్నియు సంపూర్తియైయుండెను (హెబ్రీ 4:3).
ఆ నిర్ణయము ప్రకారము మరణము యొక్క బలముగలవానిని అనగా అపవాదిని మరణముద్వారా నశింపజేయుటకును, జీవితమంతయు మరణ భయముచేత దాస్యమునకు లోబడిన వారిని విడిపించుటకు ఆయన కూడా రక్తమాంసములలో పాలివాడాయెను (హెబ్రీ 2:14-15). భూమికి పునాది వేయబడకముందే దేవత్వములోని రెండవ వ్యక్తి ఏ రూపముగా భూమికి వెళ్ళవలెనో నిర్ణయమాయెను. గమనించండి. మనుష్యుడు చేయబడకముందే, ఆ రూపములో క్రీస్తు జన్మించవలెనని నిర్ణయించబడిన రూపములోనే మానవుని నిర్మాణము జరిగెను. "మన పోలికెన, మన స్వరూపమందు నరులను చేయుదము" (ఆది 1:26) భావము ఇదే. (సశేషం)

---

Regd. No. H/KD—45/KD.H.O.

*From*
SATYAWAKKU
P.O. Box. 80
KAKINADA 533 001

No.

To